క్లుప్తంగా

ఫ్లెక్సీల ధ్వంసంపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న అనిశెట్టి దేవి

కొత్తపల్లి: పిఠాపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దివంగత అనిశెట్టి బుల్లెబ్బాయి రెడ్డి వర్ధంతికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు అంగతకులు ధ్వంసం చేశారు. ఘటనపై ఆయన భార్య ఫిర్యాదు చేసినట్లు గురువారం పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉప్పాడకు చెందిన అనిశెట్టి దేవీ తన భర్త, దివంగత మాజీ ఎమ్మెల్యే అనిశెట్టి బుల్లెబ్బాయి రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం జరిగింది. ఆ ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చింపివేయడంపై ఆమె ఫిర్యాదు చేశారన్నారు. ఘటనకు సంబంధించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

బాధిత కుటుంబాలకు గీత పరామర్శ



ముమ్మిడివారి పోడులో వెంకటరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఇన్‌చార్జి వంగ గీతా

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన మృతుల కుటుంబాలను గురువారం మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జ్ వంగా గీత పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మండలంలోని ఉప్పాడకు చెందిన మేరుగు శ్యామ్, పొన్నాడ శివారు ముమ్మిడివారి పోడుకు చెందిన ముమ్మిడి వెంకటరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాలను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు భరోసానిచ్చి, పార్టీ తరపున అండగా ఉంటామన్నారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కారే శ్రీనివాసరావు, ఎంపీటీసీ మేరుగు యల్లాజీ, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ప్రపంచ శాంతికి ఐక్యరాజ్య సమితి కీలకపాత్ర

కాకినాడ రూరల్: దేశాలను ఘర్షణల నుంచి శాశ్వత శాంతి వైపు నడిపించేది ఐక్యరాజ్య సమితి మాత్రమేనని మాజీ సైనికోద్యోగి ఎస్.శ్రీనగేష్ అన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శాంతి పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని జరిగిన కార్యక్రమం ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దాదాపు 8 దశాబ్దాలుగా సైనిక, పోలీసు, పౌర శాంతి పరిరక్షకులు చేసిన అమూల్యమైన సహకారంతో శాంతి కొనసాగుతుందన్నారు. ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షణ కార్యకలాపాల్లో 68 వేల మంది కంటే ఎక్కువ మంది పౌరులు, సైనిక, పోలీస్ సిబ్బంది పనిచేస్తున్నారని శ్రీనగేష్ తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కాకినాడ సిటీ: ఎస్.అచ్యుతాపురం అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ నగర కార్యదర్శి టి.అన్నవరం ఆధ్వర్యంలో ఎన్నికల హామీలు తక్షణం అమలు చేయాలంటూ జూన్ 2న జరిగే సీపీఐ నిరసన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, అర్బన్ ప్రాంతాల్లో రెండు సెంట్ల భూమిని మంజూరు చేస్తానని చెప్పిందన్నారు. ఈ హామీ తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా హామీలను నెరవేర్చడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు సొంతిల్లు లేక, ఇంటి అద్దెలు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రసాద్ అన్నారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన పట్టాలకు స్థలం చూపించాలని, రూ. 5 లక్షల గృహ రుణాలు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు మంజూరుపై ప్రజాప్రతినిధులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని, వృద్ధాప్య, వితంతు పింఛన్లు తొలగించకుండా పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. జూన్ 2న ఇళ్ల స్థలాల హామీ అమలు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో రాజేష్, అచ్చారావు, ప్రసాద్, వీరబాబు, కుమార్ పాల్గొన్నారు.



సాయిబాబా మందిరం వద్ద రహదారిపై గోతులు



గోతుల కారణంగా మరమ్మతులకు గురైన లారీ



బేతాళస్వామి ఆలయ సమీపంలో రోడ్డుపై గోతులు

అడుగడుగునా అవస్థలే

- పట్టణ రోడ్డుల్లో అడుగుకో గుంత
- ఏడాది పూర్తి అయినా కనిపించని శ్రద్ధ
- వాహన చోదకుల తీవ్ర ఇక్కట్లు



గడియారం స్తంభం వద్ద పిఠాపురం రోడ్డులో ఏర్పడిన గోతులు

సామర్లకోట: పట్టణ పరిధిలోని ప్రధాన రోడ్లు గోతులతో దర్శనమిస్తున్న పట్టించుకునే నాథుడే కనిపించడం లేదనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి పిఠాపురం రోడ్డు మరింత అధ్వానంగా ఉంది. పట్టణ పరిధిలో రోడ్ల నిర్వాహణ బాధ్యత ఆర్అండ్‌బీ అధికారుల పరిధిలో ఉందని మున్సిపల్ అధికారులు చెప్పుతున్నారు. పట్టణ పరిధిలోని కొన్ని రోడ్లు పెద్దాపురం ఆర్అండ్‌బీ పరిధిలోనూ, మరి కొన్ని పిఠాపురం ఆర్అండ్‌బీ పరిధిలోనికి వస్తున్నాయి. స్థానిక గడియారం స్తంబం నుంచి ఉన్న పిఠాపురం రోడ్డు ఆర్అండ్‌బీ అధికారుల పరిధిలో ఉండటంతో వారు మున్సిపాలిటీలోని రోడ్లపై దృష్టి సారించిన దాఖలాలు కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీని కారణంగా పిఠాపురం రోడ్డు గోతులతో ఉన్నా పట్టించుకొవడం లేదనే వాధనలు ఉన్నాయి. గడియారం స్తంభం వద్ద ఉన్న గోతులు కారణంగా ఒక లోడ్ లారీ యాక్సిల్ విరిగి పొవడంతో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం 10.గంటల వరకు సాయిబాబా మందిరం వద్ద నిలిచి పొయింది.

ఉప ముఖ్యమంత్రి వస్తున్నారని...

డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గంలో పవన్ కల్యాణ్ వెళుతున్నారని తెలిసి పిఠాపురం రోడ్డులోని గోతులను అధికారులు మొక్కుబడిగా పూడ్చారు. డిప్యూటీ సీఎం వెళ్లిన వారం రోజులు గడువక ముందే గోతులు యధాప్రకారం మారి పొయాయి. దాంతో ఆటోలు, మోటారు సైకిళ్లపై ప్రయాణి చేసే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గడియారం స్థంబం నుంచి గాంధీచౌక్ వరకు సీసీ రోడ్డు కావడంతో రోడ్డు బాగుంటుందని భావించి రాత్రి సమయంలో పిఠాపురం నుంచి వచ్చే వాహన చోదకులు ఈ రోడ్డులోని గోతులలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. గడియారం స్తంభం, సాయిబాబా మందిరం, గాంధీచౌక్, రైతు భవనం, మున్సిపల్ కార్యాలయం, బేతాలస్వామి ఆలయం వరకు రోడ్డు గోతులతో నిండి పొయింది. ఈ రోడ్డుపై ఉన్న గోతులను పూడ్చడానికి అధికారులు ముందుకు రాక పోవడంతో ఎదురుగా ఉన్న పారిశ్రామిక వేత్తలు సిమెంటుతో గోతులను పూడ్చించుకున్నారు.

ప్రమాదాలకు గురవుతున్నారు



పిఠాపురం రోడ్డులోని గోతులు కారణంగా చిన్న వాహనచోదకులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ఈ మార్గంలోని రాకపోకలు సాగించడం వలన ఆటోలు పాడైపోతున్నాయి. గోతులు పూడ్చి ప్రమాదాలను నివారించడానికి అధికారులు ముందుకు రావాలి.

ముమ్మిడి సత్తిబాబు, ఆటో డ్రైవరు, సామర్లకోట.

ఆర్అండ్‌బీలో కలపాలి



సామర్లకోట పరిధిలో ఉన్న ఆర్అంబీ రోడ్లను పెద్దాపురం ఆర్అండ్‌బీ కార్యాలయంలో విలీనం చేయాలి. కొన్ని రోడ్లు పిఠాపురం, కొన్ని రోడ్లు కాకినాడ, మరి కొన్ని రోడ్లు రాజమహేంద్రవరం పరిధిలో ఉండటం వలన రోడ్ల సమస్యపై అధికారులు దృష్టి సారించడం లేదు. ఫిర్యాదు చేస్తే మా పరిధి కాదని ఎవరికి వారే తప్పించుకొంటున్నారు. రోడ్లపై ఉన్న గోతులను ఎవరి దృష్టికి తీసుకు వెళ్లాలో అర్థం కావడం లేదు.

వారా సుధాకర్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్, సామర్లకోట

మురుగు పారేదెలా..



మట్టితో పూడుకుపోయిన డ్రైనులోని పైప్‌లైన్

సామర్లకోట: పట్టణంలోని గాంధీనగర్‌లో పైపులైన్ మరమ్మతులు ఆ ప్రాంత ప్రజలకు శాపంగా మారింది. గతం కొంత కాలంగా గాంధీనగర్‌లో పైపులైన్ లీకులు ఏర్పడటంతో ఇంజనీరింగ్‌శాఖ సిబ్బంది రెండు రోజుల క్రితం పైపులైన్ మరమ్మతులకు గొతులు తీశారు. ఈ మేరకు గోతులు తీయగా వచ్చిన మట్టిని సమీపంలో వేసిన సమయంలో డ్రైను మూసుకుపొయింది. దాంతో డ్రైనులో నీరు ముందుకు పోవడానికి అవకాశం లేక మురుగునీరు నిలిచి పావడంతో దోమలు పెరిగి బరించలేని చెడు వాసన వస్తుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనులో మట్టి వేసిన ప్రదేశంలో చెత్తను వేయడంతో ఆ ప్రాంతం కంపోస్టు యార్డుగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పురమిత్ర యాఫ్ ద్వారా దరఖాస్తు చేసిన్నప్పటికి స్పందన లేదని ప్రజలు వాపోతున్నారు. వెంటనే డ్రైనులో మట్టిని తొలగించిన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని స్థానికులు కొరుతున్నారు.

ఆసక్తి కలిగిన రంగాల్లో ప్రోత్సహించాలి



వేసవి శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న పాలంకి నాగరాజు

పెద్దాపురం: శాఖా గ్రంధాలయాల వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ప్రథమ శ్రేణి గ్రంధాలయ అధికారి పాలంకి నాగకాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంధాలయంలో ప్రతీ ఏటా నిర్వహించే వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలును వెలికి తీసేందుకు ఈ శిక్షణాతరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులను ప్రోత్సాహించడం తల్లిదండ్రుల బాధ్యతాన్నారు. పిల్లలకు ఆసక్తి కలిగిన రంగాల్లో వారిని ప్రోత్సాహిస్తే అద్భుతాలు సష్టిస్తారన్నారు. ఉపాధ్యాయులు వెంకట్రావు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగం బుల్లియ్య, తదితరులు పాల్గొన్నారు.

వినూత్న నిరసన



చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలియజేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు

సామర్లకోట: తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని కొరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులు చెవిలో మందార పువ్వులు పెట్టుకొని గురువారం నిరసన తెలిపారు. పట్టణం అంతా తాగునీరు, మా కళ్లలో కన్నీళ్లు, పట్టణం అంతా వెలుగులు, మా కుటుంబంలో చీకట్లు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు విలేకర్లతో మాట్లాడుతూ మున్సిపాలిటీ ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీరు సరఫరా, లైటింగ్ కోసం తాము పని చేస్తున్నామని చెప్పారు. మున్సిపాలిటీ కాంట్రాక్టు కార్మికులు 15 సంవత్సరాలు దాటిన వారిని పర్మినెంట్ చేయాలని, విధి నిర్వాహణలో చనిపోతే రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందితే రూ.ఐదు లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్, నాన్ స్కిల్ వర్కర్లను గుర్తించి కార్మిక చట్టం ప్రకారం వేతనాలు చెల్లించా లని డిమాండ్ చేశారు. గతంలో సమ్మె చేయగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు సమస్యలు పరిష్కరించక పోవడంతో సమ్మె ప్రారంభించిన్నట్లు తెలిపారు. ఈ సమ్మెలో ఔట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులో బ్రౌన్‌పేట నుంచి కోదండరామపురం వరకు రోడ్డు మార్జిన్‌లో ఉన్న విద్యుత్తు స్తంభాలు మార్పు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏఈఎన్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

పిఠాపురం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు మధ్యలో ఉన్న స్తంభాలను మార్పు చేయాలని ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురణ అయిన విషయం విధితమే. ఈ మేరకు ఆర్అండ్‌బీ అధికారుల సూచన మేరకు విద్యుత్తు స్తంభాలు మార్పు చేయడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం 7.గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బ్రౌన్‌పేట నుంచి టిడ్కో సముదాయం వరకు సరఫరా నిలిపి వేస్తామని చెప్పారు. కావున ప్రజలు గమనించి అధికారులకు సహకరించాలన్నారు.

రేషన్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



సామర్లకోటలో డీలర్లకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: రేషన్ షాపుల ద్వారా సరకులు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సరకులు ఇవ్వవలసిన బాధ్యత డీలర్లపై ఉందన్నారు. పని వేళల్లో రేషన్ షాపులు తెరచి ఉంచటంతో పాటు, తూకంలో తేడాలు లేకుండా చూడాలన్నారు. ప్రతీ రోజు స్టాక్ వివరాలను, నోటీసు బోర్డులో స్టాక్‌ను నమోదు చేయాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు రాలేని వృద్ధులు, దివ్యాంగులు ఉంటే వారికి సరకులు ఐదవ తేది నుంచి 10వ తేదిలోపు ఇంటికి అందజేసే ఏర్పాట్లు చేయాలని సూచించారు. వీఆర్వోల సహకారం ఉంటుందని, డీలర్లపై ఫిర్యాదులు వస్తే వెంటనే తొలగిస్తామని హెచ్చరించారు. నాసిరకమైన సరకులు వస్తే వెంటనే ఎంఎస్ఓ దృష్టికి తీసుకు రావాలన్నారు. రేషన్ స్టాక్‌లో ఏ మాత్రం తేడాలు ఉన్నా చర్యలు త్రీవంగా ఉంటాయని తెలిపారు. గతంలో పని చేసిన డీలర్లే ఇప్పటికీ ఉండటంతో అనుభవంతో మరింత బాధ్యతగా పని చేయాలన్నారు. ప్రతీ రేషన్ షాపు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొవాలని సూచించారు. గతంలోని మండల పరిధిలో ఉన్న 75 రేషన్ షాపుల ద్వారా ప్రతీ నెల ఒకటి నుంచి 15 వరకు సరకుల పంపిణి చేయవలసి ఉంటుందన్నారు. ప్రతీ రోజు ఉదయం 8 నుంచి 12, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు తెరచి ఉంచాలన్నారు. దీనికి సంబంధించి వీఆర్వోల పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు.

పవన్ ప్రతిపాదించేస్తే పాలకవర్గం ఎందుకు?

- ఛైర్ పర్సన్‌ను సంప్రదించరా!
- కమిషనర్ తీరుపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల ఆగ్రహం
- టేబుల్ అజెండా మండిపడిన వైనం



కమిషనర్ తీరుకు నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనులను నిర్దేశించేస్తే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన మేమేందుకు అంటూ పలువురు కౌన్సెలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం గురువారం ఛైర్ పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే.. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గొల్లప్రోలు నగర పంచాయతీ అభివృద్ధికి రూ.కోటి నిధులు కేటాయించారని, వాటితో 27 అభివృద్ధి పనులను ఆయన సూచించారని కమిషనర్ కనకారావు టేబుల్ అజెండాను కౌన్సిల్ ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. అయితే తమకు సంబంధం లేకుండా అజెండాను ఎలా రూపొందించారంటూ కమిషనర్‌ను ఛైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు ప్రశ్నించారు. ఆయన తీరుపై మండిపడుతూ టేబుల్ అజెండాపై సంతకం చేయడానికి నిరాకరించారు. దీంతో కమిషనర్ కనకారావు తన సంతకంతో అజెండాను కౌన్సిల్‌లో ప్రవేశ పెట్టడంతో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు గంటా అప్పలస్వామి, గంద్రేటి శ్రీరామచంద్రమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సభ్యులకు సమాచారం లేకుండా, ఉప ముఖ్యమంత్రి సూచించారని మీరే పనులు నిర్ణయించడంతో పాటు ఛైర్ పర్సన్‌ను పట్టించుకోకుండా అజెండాను ఎలా ప్రవేశ పెడతారంటూ ప్రశ్నించారు. అయితే నగర పంచాయతీని అభివృద్ధి చేయడానికి నిధులు ఇస్తే అడ్డుకుంటారా అని టీడీపీ కౌన్సిలర్ గుళ్ల సుబ్బారావు ప్రశ్నించారు.

దీంతో టీడీపీ, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు మధ్య వాగ్వాదం జరిగింది. ఆ పనులకు సంబంధించి మరోసారి ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చించాలని వైఎస్సార్ సీపీ సభ్యులు పట్టుబట్టడంతో చేసేదేమి లేక వచ్చే నెల 5వ తేదీన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని సభ్యులు తీర్మానించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో నగర పంచాయతీలో పూర్వం నుంచి ఉన్న విద్యుత్ బకాయిలను చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించిందని, దాని కోసం రూ 9.20 కోట్లు కేటాయించామని కమిషనర్ సమావేశంలో తెలిపారు.

నగర పంచాయతీ పరిధిలో వీధి లైట్లు సక్రమంగా వెలగడం లేదని వైస్ ఛైర్ పర్సన్ గంధం నాగేశ్వరరావు, కౌన్సిలర్లు గుళ్ల సుబ్బారవు, గంటా అప్పలస్వామి, మైనం భవానీ రాజా సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వీధి లైట్ల నిర్వహణకు టెండర్లు పిలిచామని ఈ విషయాన్ని 5వ తేదీన జరిగే సమావేశం దృష్టికి తీసుకువస్తామని కమిషనర్ తెలిపారు. రూ.15 లక్షలతో పూడికతీత పనులు చేపట్టినట్లు చెబుతున్నారని, కానీ ఎక్కడ ఎటువంటి పనులు జరిగిన ఆనవాళ్లు లేవని కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కాకినాడ జిల్లా క్రీడాకారులు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



పోటీల విజేతలు

పిఠాపురం: పిఠాపురం ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జూనియర్ బాల,బాలికల బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు కాకినాడ జిల్లా నలమూలల నుంచి 45 మంది బాక్సర్లు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఆరుగురు 12 మంది క్రీడాకారులను ఎంపికైనట్లు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.లక్ష్మణరావు తెలిపారు.

బాలికల విభాగంలో:

50 కేజీల విభాగంలో పి.మహాలక్ష్మి (పిఠాపురం), 54 కేజీల విభాగంలో ఎల్. రిషిక (కాకినాడ), 57 కేజీల విభాగంలో కె.హర్షిని (పిఠాపురం). 60 కేజీల విభాగంలో సి.హెచ్ శ్వేత అంశిక (కాకినాడ). 63 కేజీల విభాగంలో యల్.లాస్య (కాకినాడ), 80 కేజీల పైబడిన విభాగంలో జే.ఐశ్వర్య సూర్య దీపిక (పిఠాపురం) స్వర్ణ పథకాలు సాధించి విజేతలుగా ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

బాలుర విభాగంలో:

46 కేజీల విభాగంలో పి.నాని (పిఠాపురం), 48 కేజీల విభాగంలో డి.రాహుల్ (కాకినాడ), 57 కేజీల విభాగంలో జె.గౌతమ్ (కాకినాడ), 75 కేజీల విభాగంలో జే.రాఘవేంద్ర అరుణ్ (పిఠాపురం), 80 కేజీల విభాగంలో ఎం. అజిత్ హర్ష (తుని), 80 కేజీల కన్నా పై విభాగంలో జె.రాఘవేంద్ర, ఆదిత్య పిఠాపురంలు స్వర్ణ పథకాల సాధించి విజేతలుగా ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు:

వీరందరూ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాక్సింగ్ పోటీలలో పాల్గొంటారన్నారు. బాలికల విభాగంలో ఎంపికైన వారు ఈనెల 31వ తేదీన విశాఖపట్నంలో జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల బాక్సింగ్ పోటీల్లో తలపడతారన్నారు. బాలుర విభాగంలో ఎంపికైన వారు జూన్ రెండో తేదీన విశాఖపట్నం గాజువాక దగ్గర జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాయ్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలను పిఠాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కేశవరావు. కళాశాల సీనియర్ అసిస్టెంట్ సురేష్.రమణ. కె.చిన్నబ్బాయి, రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు పద్మనాభం తదితరులు ప్రారంభించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

యోగాతో ఒత్తిడి దూరం



సామర్లకోట మండలంలో యోగా శిక్షణ పొందుతున్న సిబ్బంది

సామర్లకోట: ప్రతీ ఒక్కరూ తమ ఆరోగ్యం కోసం కనీసం రోజు గంట సమయాన్ని కేటాయించి యోగా చేయాలని ఎంపీడీఓ హిమామహేశ్వరీ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో గురువారం పి. వేమవరం, ఉండూరు, పనసపాడు గ్రామాలలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది నిర్వహించిన యోగా శిక్షణలో ఆమె పాల్గొన్నారు. శిక్షణ పొందినపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఆయా గ్రామాలలోని యువతకు యోగాపై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం మనం తీసుకొంటున్న ఆహర పదార్థాల్లో నాణ్యత లోపించడాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం కోసం యోగా చేయాలన్నారు. టీఓటీలుగా శిక్షణ పొందిన సిబ్బంది ఆయా గ్రామాలలో ప్రజలకు యోగా శిక్షణ ఇచ్చే సమయంలో ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఉత్తమ యోగా శిక్షణ ఇవ్వడంతో పాటు ఎక్కువ మందికి శిక్షణ ఇచ్చిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న పురస్కారాలు ఉంటాయని తెలిపారు. టీఓటీలకు జగదాంబ, రవి, శ్రీనివాసు, లక్ష్మణకుమార్, యార్లగడ్డ బంగ్రారాజులు యోగా శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లాడి భైరవ మూర్తి, ఏఓ సతీష్, సీనియర్ అసిస్టెంట్ జగన్నాధరావులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల పరిషత్ పరిపాలన అధికారి వి.చలమయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం యోగాపై వ్యవసాయ, మత్స్యశాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రతి గ్రామ సచివాలయంలో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించాలని సూచించారు.